సాక్షి అనకాపల్లి
మంగళవారం । 22 । ఆగస్టు । 2023



అర్జీలకు పరిష్కారం

ఈవారం కలెక్టరేట్ స్పందనకు 266 అర్జీలు వచ్చాయి. వాటికి వెంటనే సమాధానాలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. 8లో



తప్పిన ప్రాణాపాయం 8లో

పాడేరు వద్ద లోయలో పడిన బస్సు ప్రయాణికులు కోలుకుంటున్నారు. సకాలంలో వైద్యం అందడంతో ప్రాణాపాయం తప్పింది.



శతాబ్ది ఉత్సవాలకు రండి

విశాఖ: ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలకు హాజరు కావాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మాండవీయను ఆహ్వానించారు.

న్యూస్‌రీల్

రూ.9.25 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణం

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



చోడవరం: చోడవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు సొంత భవన నిర్మాణానికి రూ.9.25 కోట్ల నిధులు మంజూరైనట్లు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సోమవారం తన కార్యాలయంలో మీడియాకు తెలిపారు. ఇప్పటి వరకు పాలిటెక్నిక్ కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో స్థానిక గాంధీగ్రామం ప్రభుత్వ హైస్కూల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కాలేజీకి సొంత భవనం నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. వెంకన్నపాలెంలో సుమారు ఆరెకరాల స్థలాన్ని సమకూర్చినట్లు పేర్కొన్నారు. స్థల సేకరణ చేసిన విషయాన్ని ప్రభుత్వానికి నివేదించడంతో, వెంటనే సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడినట్లు పేర్కొన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. దీంతో విద్యార్థులకు వసతుల లేమి సమస్య తొలగిపోతుందన్నారు. కళాశాల భవనానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తలకు కొరివి పెట్టి.. తండ్రి రుణం తీర్చి

తండ్రి చితికి నిప్పంటించిన కూతుళ్లు



తండ్రికి దహన సంస్కారాలు చేస్తున్న కూతుళ్లు అలేఖ్య, అఖిల

నర్సీపట్నం: అన్నీ తానై, అల్లారుముద్దుగా పెంచిన తండ్రి అకాల మరణం చెందాడు. కుటుంబానికి అండగా నిలిచే మగ దిక్కు లేకుండా పోయింది. ఆ తండ్రికి సంతానం ఇద్దరూ కూతుళ్లే. తండ్రి అండదండలున్నాయన్న ధీమాతో బతికిన ఈ చిన్నారులు పుట్టెడు శోకంలోనూ పాడెను భుజానికెత్తుకున్నారు. తండ్రికి తలకొరివి పెట్టి కూతుళ్లుగా కొంత రుణం తీర్చుకున్నారు. మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి థెరిస్సాకాలనీలో చోటుచేసుకున్న విషాద మిది. కాలనీలో నివాసం ఉంటున్న టి.ఈశ్వరరావు అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు(అలేఖ్య, అఖిల) ఉన్నారు. కూతుళ్లు ఎదుగుతున్న తరుణంలో తండ్రి మరణం ఆ కుటుంబాన్ని దుఃఖసాగరంలో ముంచెత్తింది. ఆ ఆవేదనను దిగమింగుకుని తండ్రి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ ఘటన స్థానికుల హృదయాలను కలచివేసింది.

తప్పుడు పోస్టులపై కఠిన చర్యలు

ఎస్పీకి మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ విజ్ఞప్తి



ఎస్పీ మురళీకృష్ణకు ఫిర్యాదు అందజేస్తున్న గెడ్డం ఉమ

సాక్షి, అనకాపల్లి: సోషల్ మీడియాలో తనపై తప్పుడు పోస్టులు పెడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ కోరారు. సోమవారం ఈమేరకు ఆమె ఎస్పీ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా తనపై వివిధ మాధ్యమాలలో అసత్య పోస్టులు పెడుతూ తీవ్ర ఆరోపణలు చేస్తున్న వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఎస్పీకి ఆమె విజ్ఞప్తి చేశారు. ఎటువంటి ఆధారాలు లేకుండా మహిళలపై తప్పుడు పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

అనకాపల్లిటౌన్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని 2023 ఏడాదికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. తమ దరఖాస్తులను ఉప విద్యాశాఖాధికారి, యలమంచిలి లేదా సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల ద్వారా ఈ నెల 24లోగా సమర్పించాలని కోరారు.



చందమామను అందుకుందాం

చందమామ రావే.. జాబిల్లి రావే.. అని పాట పాడే రోజులు పోయాయి.. చంద్రుడిపై మనమే కాలు మోపే అరుదైన ఘడియలు సమీపిస్తున్నాయి. చంద్రయాన్-3 ప్రయోగంలో కీలక ఘట్టమైన సాఫ్ట్ ల్యాండింగ్ సజావుగా జరగాలని ఆకాంక్షిస్తూ కింతాడ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ విద్యార్థులు గ్రామంలో ర్యాలీ జరిపారు. ప్రిన్సిపాల్ బి.చిన్నమ్మలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. చివరి ఘట్టాన్ని కూడా శాస్త్రవేత్తలు విజయవంతం చేయాలని వారు శుభాకాంక్షలు తెలిపారు. -కె.కోటపాడు

ముగ్గురు ఒడిశా కార్మికుల మృతి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం
- ఫుడ్ పాయిజన్ కారణం

అచ్యుతాపురం (అనకాపల్లి): దుప్పుతూరు లేబర్ క్యాంప్‌లో ఉన్న ముగ్గురు ఒడిశా కార్మికులు వరుసగా మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మండలంలోని ఎస్ఈజెడ్‌లో ఉన్న కర్మాగారాల్లో దినసరి కార్మికులుగా పనిచేయడానికి వేరే ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. వారు దుప్పుతూరు లేబర్ క్యాంప్‌లో తలదాచుకుంటారు. ఎవరికి వారు స్వయంగా వంట చేసుకుంటారు. ఈనెల 15న ఇక్కడకు వచ్చిన ఒడిశాకు చెందిన జాగా మినిక్ అనే కార్మికుడు ఆ మర్నాడు 16న మృతి చెందాడు. ఆయనతో ఉన్న మరో ఇద్దరు ఒడిశావాసులు అస్వస్థతకు లోను కావడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ ఒకరు, స్వస్థలానికి వెళుతూ రైలులో మరొకరు మృతి చెందినట్టు అధికారులు సేకరించిన సమాచారం. ఈ విషయం తెలియడంతో కార్మికుల మృతికి విషాహారం కారణమా లేదా ఏదైనా వ్యాధితో బాధ పడుతున్నారో ఆరా తీసేందుకు వైద్య శాఖ రంగంలోకి దిగింది. డయేరియా ఏదైనా ప్రబలిందా అని తెలుసుకునేందుకు వైద్యాధికారులు దుప్పుతూరు లేబర్ క్యాంప్‌ని పరిశీలించారు. అక్కడ ఎటువంటి అనారోగ్య పరిస్థితులు, వ్యాధులకు సంబంధించిన ఆనవాళ్లు కనిపించకపోవడంతో వీరు తిన్న ఆహారం కలుషితమయిందా అనే కోణంలోనూ విచారిస్తున్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వేణుగోపాల్‌తో పాటు ఆశా కార్యకర్తలు దుప్పుతూరులో పర్యటించారు. పూర్తి వివరాలు రావాల్సి ఉందని అచ్యుతాపురం మండల వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య తెలిపారు.

ఐటీఐలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

నర్సీపట్నం: ఈ విద్యా సంవత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ డి.శ్రీనివాసాచారి తెలిపారు. మూడో విడత ప్రవేశాలకు నిర్వహించే కౌన్సెలింగ్‌లో ఐటీఐలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు ఈ నెల 27న ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 28న సమీపంలోని ఐటీఐలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 30న అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టు ఫొటోలతో ఐటీఐలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

దంతులూరికి ఆత్మీయ స్వాగతం



దంతులూరి, అమర్‌నాథ్‌లకు భారీ గజమాల



రింగ్‌రోడ్డు మంత్రి కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ

- రాష్ట్ర ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి అనకాపల్లి రాక
- భారీ ప్రదర్శనతో బ్రహ్మరథం పట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- అభినందన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: రాష్ట్ర ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన దంతులూరి దిలీప్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం ఘనస్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి అనకాపల్లి వచ్చిన సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు. దిలీప్‌కుమార్ తొలుత భీమునిగుమ్మం అంబేద్కర్ విగ్రహానికి ఎంపీపీ గొర్లి సూరిబాబుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రింగ్‌రోడ్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ కార్యాలయంలో మంత్రి అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌లతో కలిసి దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయం వద్ద బైక్ ర్యాలీని మంత్రి అమర్‌నాథ్ ప్రారంభించారు. ఓపెన్ టాప్ జీప్‌లో రింగ్‌రోడ్డు, బెల్లంమార్కెట్ రహదారి, మళ్ల బ్రదర్స్, పెరుగుబజార్ జంక్షన్, నెహ్రూచౌక్, రామచంద్ర థియేటర్ మీదుగా మండలంలో తుమ్మపాల బంగారురాజు కల్యాణమండపం వరకు ర్యాలీ చేపట్టారు. స్థానిక నెహ్రూచౌక్‌లో పార్టీ శ్రేణులు మంత్రి అమర్‌నాథ్, దిలీప్‌కుమార్, బొడ్డేడ ప్రసాద్‌లను గజమాలతో సత్కరించాయి. ఈ సందర్భంగా చైర్మన్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీని ఈ ఏడాది జూన్ రెండో తేదీన ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. రాష్ట్రంలో ఓడరేవులకు జలమార్గాలను అనుసంధానం చేయడం, వాటర్ బౌండు టూరిజం, వెసల్స్ రిజిస్ట్రేషన్ తోపాటు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ చట్టాన్ని అమలు చేయడం తమ అథారిటీ విధివిధానాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, జీవీఎంసీ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, కశింకోట మండలం జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ నాయకులు కలగా గున్నయ్యనాయుడు, మలసాల కిషోర్, దాసరి అప్పారావు, దంతులూరి కల్యాణ్, విల్లూరి చంద్రశేఖర్, వెంపరాల శర్మ, తదితరులు పాల్గొన్నారు.

తీరం...పర్యాటక హారం

- జిల్లాలో 35 బీచ్‌ల గుర్తింపు
- పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు
- సినిమా షూటింగ్‌లకు 'తంతడి' ప్రత్యేకం
- ముత్యాలమ్మపాలెం, తంతడి, పూడిమడక, సీతపాలెం, రేవు పోలవరం వంటి తీర ప్రాంతాల గుర్తింపు
- మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు



పూడిమడక తీరం

అచ్యుతాపురం(అనకాపల్లి): పర్యాటకానికి పెద్ద పీట వేసే దేశాల్లో ఆర్థిక వనరులు మెరుగుపడతాయి. నిత్యం పర్యాటకుల సందడి ఉంటే ఆ ప్రాంతంలో వాణిజ్య, రవాణా పరమైన అభివృద్ధి మెరుగుపడుతుంది. ఈ కారణంగా సుందర ప్రాంతాలను తీర్చిదిద్దడంలో ఆయా దేశాలు ముందుంటాయి. మనసుని ఆహ్లాదపరిచి కాసింత తేలికపరిచే పర్యాటక కేంద్రాలకు అదనపు హంగుల్ని చేర్చే పనిలో ఆ శాఖ నిమగ్నమయింది. ఏజెన్సీతో పాటు సముద్ర తీర దృశ్యాల్ని ఆస్వాదించే వారికి పర్యాటక శాఖ మరింత వెసులుబాటు కలిగించనుంది. తీర ప్రాంతానికి ఆనుకొని ఉన్న ఏపీలో ఉమ్మడి విశాఖ జిల్లాకు ప్రత్యేక స్థానముంది. తాజాగా ఏర్పడిన అనకాపల్లిలో కోస్టల్ మేనేజ్‌మెంట్‌కు అనుబంధంగా పర్యాటక శాఖ అడుగులు వేస్తోంది.

35 బీచ్‌ల అభివృద్ధికి ప్రణాళికలు...

అనకాపల్లి జిల్లాలోని 35 బీచ్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. కనీసం రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం ఉండి, రవాణా సౌకర్యం మెరుగుపరచడం ద్వారా టూరిజం స్పాట్‌లు ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ నిర్ణయించింది. ఇప్పటికే పర్యాటక ప్రియులకు ఏయే సముద్ర తీరాలు సహజ అందాలతో కట్టిపడేస్తాయో తెలుసు. అందుకే ఆయా పర్యాటకులు ఎటువంటి వసతులు లేకున్నప్పటికీ తీరంలోని దృశ్యాలను ఆస్వాదిస్తూ చెట్ల కింద సేద తీరుతున్నారు. వీరి కోసం వసతులు కల్పించే పనిలో పర్యాటక శాఖ ప్రణాళికలు రూపొందించే నివేదికను ఉన్నతాధికారులకు పంపించింది.

రెస్టారెంట్లు, గెస్ట్ హౌస్‌ల ఏర్పాటుకు నిర్ణయం..

తీరంలో 35 బీచ్‌లలో అందుబాటులో ఉన్న స్థలాలపై ఇప్పటికే ఆ శాఖకు ఒక అంచనా ఉంది. ఆ మేరకు స్థల సమస్య తీరిన వెంటనే పర్యాటకులకు అవసరమైన ఫుడ్ కోర్టులు, రెస్ట్ రూమ్‌లు నిర్మించే పనికి ఉపక్రమిస్తోంది. అన్ని రకాల సాంకేతిక అవరోధాలు పూర్తయిన వెంటనే టెండర్లు పిలిచి బీచ్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకోనుంది. స్థలాలు లేని చోట కనీసం కూర్చొనేందుకు కుర్చీలు, ఇతరత్రా వసతులు కల్పించనుంది. ప్రధానంగా తీరాన్ని ఆనుకొని ఉన్న కొండలు, ఉప్పుటేరుల్ని దృష్టిలో పెట్టుకొని ఆయా బీచ్‌ల గుర్తింపు జరిగింది.

రేవు పోలవరంపై ప్రత్యేక దృష్టి...

అనకాపల్లి జిల్లా తీర ప్రాంతంలో రేవు పోలవరంలో ప్రధానంగా బీచ్ అభివృద్ధికి 8 ఎకరాలు సేకరించారు. ఇక్కడ ఉన్న విశాలమైన తీర ప్రాంతాన్ని, జెట్టీని, అడ్డురోడ్డు నుంచి రవాణా మార్గాన్ని గుర్తించారు. ఈ మేరకు అవసరమైన వసతులకు సంబంధించి ఇప్పటికే టెండర్లు పిలిచినట్టు పర్యాటక శాఖ అధికారులు చెబుతున్నారు. ముత్యాలమ్మపాలెం, తంతడి, పూడిమడక, సీతపాలెం వంటి తీర ప్రాంతాలను గుర్తించారు. కొన్ని బీచ్‌ల వద్ద కొద్ది పాటి సమస్యల్ని పరిష్కరించి దశల వారీగా బీచ్‌ల అభివృద్ధి చేపట్టనున్నారు. తంతడిలో జరుగుతున్న సినిమా షూటింగ్‌ల నిర్వాహకులకు అక్కడే ఉండే అవకాశం లేకపోవడంతో రాత్రి బస కోసం విశాఖకు వెళ్లి రావాల్సి వస్తోంది. దీనిని కూడా పరిగణనలోకి తీసుకొని తీర ప్రాంతాల్లో గెస్ట్ హౌస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. విశాఖపట్నం తీరంలో వెలసిన గెస్ట్ హౌస్‌లు, హోటళ్లను దీనికి నిదర్శనమని ఆ శాఖ భావిస్తోంది.

బీచ్‌లను అభివృద్ధి చేస్తాం

అనకాపల్లి జిల్లాలో 35 బీచ్‌ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. రేవు పోలవరం వద్ద 8 ఎకరాల పరిధిలో 2015లో సేకరించిన భూమి మేరకు టెండర్లు పిలిచాం. రెస్ట్ హౌస్‌లు, ఫుడ్ కోర్టులు, సమాచార కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. రవాణా సౌకర్యం, బీచ్ వద్ద లభ్యతలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిగణలోకి తీసుకుంటాం. ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం.

-అశోక్, జిల్లా పర్యాటక అధికారి, అనకాపల్లి

గంగపుత్రులకు కాసుల పంట

- వలకు చిక్కిన అరుదైన చేపలు
- దాదాపు 30 టన్నులు పడినట్లు సమాచారం
- విలువ సుమారు రూ.కోటి



మత్స్యకారుల వలకు చిక్కిన అరుదైన చేపలు

నక్కపల్లి: రాజయ్యపేట తీరంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు సోమవారం అరుదైన చేపలు లభించాయి. వీటిని సుంచులుగా మత్స్యకారులు చెబుతున్నారు. చాలా అరుదుగా లభించే ఈ చేపల ఖరీదు ఎక్కువేనని వారు పేర్కొంటున్నారు. సోమవారం నక్కపల్లి మండలం రాజయ్యపేట, ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం, పాయకరావుపేట మండలం రాజవరం గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఉదయాన్నే సముద్రంలోకి వేటకు వెళ్లారు. వేట సాగిస్తుండగా వీరి వలలకు సుంచులు రకం చేపలు చిక్కాయి. దీంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ఈ చేపల ఖరీదు కిలో రూ.350లు ఉంటుందని గంగపుత్రులు తెలిపారు. వీటిని అపోలో ఫిష్ అంటారని కొందరు చెప్పారు. రాజయ్యపేటలో వేట సాగించిన వారికి 10 టన్నుల చేపలు దొరికాయి. అలాగే రేవుపోలవరంలో పది టన్నులు, వెంకటనగరంలో మరో పది టన్నులు లభించినట్లు తెలిసింది. నాలుగు చేపలు కలిసి కిలో బరువు ఉంటాయని మత్స్యకారులు చెబుతున్నారు. సముద్రంలోపల భాగంలో రాళ్లకు సమీపంలో ఇవి ఎక్కువగా జీవిస్తుంటాయని, ఈ ప్రాంతాల్లో ఎప్పుడూ లభించలేదని మత్స్యకారులు నాగేశు, వెంకటేష్ తెలిపారు. గతంలో ఒకటి రెండు చేపలు మాత్రమే వలలకు చిక్కేవని, ఈ రోజు మాత్రం వరుసగా వేటకు వెళ్లే వారందరికీ ఈ చేపలు లభించడం ఆశ్చర్యంగా ఉందని మత్స్యకారులు తెలిపారు.

ఇతర రాష్ట్రాల్లో వీటికి ఎక్కువ డిమాండ్ ఉండటంతో గుజరాత్, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు వీటిని ఎగుమతి చేస్తున్నామని మత్స్యకారులు తెలిపారు. మూడు గ్రామాల్లో లభించిన 30 టన్నుల చేపల ఖరీదు సుమారు కోటి రూపాయల పైబడే ఉంటుందని వారు తెలిపారు. తాము కిలో రూ.350ల చొప్పున వ్యాపారులకు విక్రయించామని, వారు రవాణా ఖర్చులు కలుపుకుని ఎక్కువ ధరకే విక్రయించి లాభాలు ఆర్జిస్తారంటూ వారు పేర్కొన్నారు. స్టార్ హోటళ్లలో ఈ చేపల విక్రయాలు ఎక్కువగా ఉంటాయని సమాచారం.

ఉత్తరం రాయండి.. బహుమతి పొందండి..

పోస్ట్.. అనే పిలుపు కోసం ఎదురు చూసిన క్షణాలు గుర్తున్నాయా.. అభిమాన లేఖలు, సమాచారం మోసుకొచ్చిన ఉత్తరాలు అందుకొని అపురూపంగా చదువుకొని ఎన్నాళ్లయిందో.. మనసులోని భావాలను కాగితంపై పెట్టి అందమైన దస్తూరితో అవతలి వారికి చేరవేయడం ఈ తరం వారికి తెలీనే తెలీదు. సెల్‌ఫోన్ మెసేజ్‌లు, ఈ-మెయిళ్లు, వాట్సాప్ సందేశాలు, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం నేటి ట్రెండ్. అందుకే ఉత్తరాన్ని ఓసారి గుర్తు చేద్దామని తపాలా శాఖ తలపెట్టింది. లేఖరులకు పోటీ పెడుతోంది. ఇంకెందుకు ఆలస్యం.. కలం కదిలించండి.

- లేఖా రచనను ప్రోత్సహించేందుకు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలు
- విజేతలకు విలువైన బహుమతులు అందిస్తున్న తపాలాశాఖ



అనకాపల్లి రూరల్: నేటి డిజిటల్ యుగంలో ఉత్తరాలకు ప్రాధాన్యం తగ్గింది. పెన్ను, పేపర్ పట్టి లేఖ రాయడం అందరూ మరిచారు. చేతిలో మొబైల్ ఫోన్ ఉంటే సమస్త సమాచారం క్షణాల్లో తెలుసుకొనే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. గతంలో ఉత్తరాలు కొనుగోలు చేసి బంధువులు, స్నేహితులను ఆప్యాయంగా పలకరిస్తూ స్వదస్తూరితో లేఖలు రాసేవారు. నేటితరానికి ఆ అవసరం లేకుండా పోయింది. ఆనాటి సమాచార సాధనం గురించి యువతరానికి తెలపాలని, మరిచిపోయిన ఆనాటి తరానికి గుర్తు చేయాలని తపాలాశాఖ లేఖారచన పోటీలకు శ్రీకారం చుట్టింది. 'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా' అనే అంశంపై లేఖలను ఆహ్వానిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో ధాయి ఆఖర్ పేరుతో పోటీలు నిర్వహిస్తోంది.

ఎవరు పాల్గొనవచ్చంటే..

భారతదేశ పౌరులెవరైనా ఈ పోటీలో పాల్గొనవచ్చు. ఎలాంటి వయో పరిమితి లేదు. 18 ఏళ్ల లోపు వారిని ఒక కేటగిరీగా, 18 ఏళ్ల పైబడిన వారిని మరో కేటగిరీగా పరిగణిస్తారు. తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో వ్యాసం రాయవచ్చు. డిజిటల్ విధానంలో పాలన, మౌలిక సదుపాయాలు ,అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్స్ తదితర అంశాలను అందులో పొందుపర్చాలి. ఏ4 సైజు పేపరుపై రాసి ఎన్వలప్ కవర్‌లో ఉంచి పంపించవచ్చు. లేదా ఇన్‌లాండ్ లెటర్ ద్వారా కూడా పంపించవచ్చు. ఎన్వలప్ కవర్ అయితే వెయ్యి పదాలకు మించకుండా, ఇన్‌లాండ్ లెటర్‌లో అయితే 500 పదాలకు మించకుండా రాయాల్సి ఉంటుంది. కంప్యూటర్, ఇతర ఎలక్ట్రానిక్ సాధనాల్లో టైప్ చేసిన లేఖలను పోటీకి అనుమతించరు. చేతితో రాసి వ్యాసం పంపాలి. లేఖలను పంపించేవారు వారి వయసును నిర్ధారిస్తూ సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి. పోటీలో గెలిస్తే వారి వయసు, ఐడీ ధ్రువీకరణకు అవసరమైన పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా రాసిన ఉత్తరాలను 'ది చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్, ఏపీ సర్కిల్, విజయవాడ-520013' చిరునామాకు అక్టోబరు 31 లోగా పంపించాలి.



పోటీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తపాలాశాఖ అధికారులు

బహుమతులు ఇవీ..

విభాగాల వారీగా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో విజేతలను ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి (12 మందికి మించకుండా) నగదు బహుమతులు అందజేయనున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు వరుసగా రూ.25 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు ఇస్తారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారి లేఖలను జాతీయ స్థాయికి పంపుతారు. జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ రూ.50 వేలు, ద్వితీయ రూ.25 వేలు, తృతీయ రూ.10 వేల నగదు అందిస్తారు.

మంచి అవకాశం



తపాలాశాఖ రూపొందించిన ఈ ఉత్తరాల పోటీ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంచి అవకాశం. అన్ని వయసులవారూ ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. ఇచ్చిన అంశానికి సంబంధించి స్వదస్తూరితో వ్యాసం రాసి పోస్టు చేయాలి. మా ఇన్‌స్పెక్టర్లు, సబ్ పోస్టుమాస్టర్లు, బీపీఎంలు పోటీపై ప్రచారం చేపడుతున్నారు.

-జనపాల ప్రసాద్‌బాబు, పోస్టల్ సూపరింటెండెంట్, అనకాపల్లి డివిజన్

విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుంది



విద్యార్థుల్లో ఇలాంటి కార్యక్రమాలు పోటీతత్వాన్ని పెంచుతాయి. పాఠశాలలు, కళాశాలల్లో ఈ పోటీపై అవగాహన కల్పిస్తున్నాం. ఆంగ్లం, హిందీలతోపాటు స్థానిక భాషల్లో కూడా వ్యాసం రాయవచ్చు. డిజిటల్ యుగంలో స్వదస్తూరితో ఉత్తరాలు రాయడం తగ్గిపోయింది. మళ్లీ దానిని అలవాటు చేయడానికి ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయి.

-సంజయ్ కుమార్ పాండా, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్, అనకాపల్లి డివిజన్

క్లుప్తంగా

మహిళా కబడ్డీ పోటీల్లో నెల్లిమర్ల జట్టు విజయం



విజేతలకు బహుమతి ప్రదానం

రాంబిల్లి: హరిపురంలో నిర్వహించిన మహిళా కబడ్డీ పోటీల్లో నెల్లిమర్ల జట్టు విజేతగా నిలిచింది. అనకాపల్లి జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. విజేతగా నిలిచిన నెల్లిమర్ల జట్టుకు రూ.20వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన అనకాపల్లి జట్టుకు రూ.15వేలు నగదు, షీల్డులను అందజేశారు.

25లోగా నవోదయకు దరఖాస్తు చేసుకోవాలి

- ఉమ్మడి జిల్లాలో నవోదయలో 10వేలు సీట్లు
- నవోదయ అడ్మిషన్ల కోఆర్డినేటరు శ్రీధర్



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా నవోదయ అడ్మిషన్ల కోఆర్డినేటరు శ్రీధర్

నాతవరం: విద్యార్థులు నవోదయలో చేరేందుకు ఈనెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా నవోదయ ఆడ్మిషన్ల కోఆర్డినేటరు శ్రీధర్ అన్నారు. ఆయన నాతవరం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి నవోదయలో విద్యార్థులు చేరేందుకు దరఖాస్తులు చేయించాలని అవగాహన కల్పించారు. నవోదయ స్కూల్‌లో ప్రభుత్వం కాంట్రాక్టరు పద్ధతిలో పని చేసే ఉపాధ్యాయులను తొలగించి రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించిందన్నారు. విద్యార్థులకు అసక్తి ఉన్న విధంగా విద్యతో పాటు క్రీడలు ఆటల పోటీలపై తరీఏదు ఇవ్వడం జరుగుతుందన్నారు. కేంద్రప్రభుత్వ విద్యా సంస్థల్లో చేరేందుకు ఎన్ఐటి ఐఐటీ వంటి పోటీ పరీక్షల కోసం హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 7799272555 నెంబరును సంప్రదించాలన్నారు.

సత్వర వైద్యం.. తప్పిన ప్రాణాపాయం

పాడేరు ఘాట్‌రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారంతా కోలుకుంటున్నారు. సకాలంలో స్పందించిన అధికార యంత్రాంగం క్షతగాత్రులకు సత్వర వైద్య సేవలందించి ప్రాణనష్టానికి అడ్డుకట్ట వేయగలిగింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు, ప్రజాప్రతినిధులు సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

- కోలుకుంటున్న ఆర్టీసీ బస్సు ప్రమాద బాధితులు
- సకాలంలో స్పందించిన ప్రభుత్వం

సాక్షి, పాడేరు: పాడేరు ఘాట్ లోయలోకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కిల్లో బోడిరాజు, బొట్ట చిన్నమ్మలతోపాటు మరో ముగ్గురికి ప్రాణాపాయం లేదని వైద్యులు సోమవారం మధ్యాహ్నం తెలిపారు. వీరికి విశాఖలోని మెడికవర్ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందిస్తున్నామన్నారు. మరోవైపు ఇదే ప్రమాదంలో గాయపడి పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేరిన వారిలో ఐదుగురు కోలుకుని ఇళ్లకు క్షేమంగా వెళ్లిపోయారు. ప్రస్తుతం 21 మంది ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. వారికి ఉన్నత వైద్య సేవలతోపాటు మూడు పూటల పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. వీరిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావుతోపాటు ఇతర వైద్య బృందమంతా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు, జిల్లా ఆస్పత్రిలోని గైనిక్ వైద్యుడు తమర్బ నరసింగరావు సైతం మహిళలకు, చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్నారు. బాధిత ప్రయాణికులంతా పూర్తిగా కోలుకున్న తర్వాతే ఇళ్లకు పంపాలని, వైద్య బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌తోపాటు వైద్య ఆరోగ్యశాఖ, వైద్యవిధాన పరిషత్ అధికారులు తగిన ఆదేశాలిచ్చారు.

బస్సు ప్రమాదంపై ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ విచారం

ఘాట్ లోయ సంఘటనపై ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ విచారం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయాన్నే ఆమె పాడేరు ఘాట్‌లోని సంఘటన స్థలానికి చేరుకున్నారు. లోయలోకి దూసుకుపోయిన బస్సును పరిశీలించారు.



పాడేరు జిల్లా ఆస్పత్రిలో కోలుకుంటున్న బాధిత ప్రయాణికులతో వారి కుటుంబ సభ్యులు

అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రిలో కోలుకుంటున్న బాధిత ప్రయాణికులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్య బృందాలను ఆదేశించారు. ఈ ప్రమాదంలో నారాయణమ్మ, సీసా కొండన్న మృతిచెందడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలతో పాటు, గాయపడిన ప్రయాణికులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట విశాఖ ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కణితి వెంకటరావు, పాడేరు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

మాజీ మంత్రి బాలరాజు, డాక్టర్ వెంకటలక్ష్మి పరామర్శ

విశాఖలోని మెడికవర్ ఆస్పత్రిలో ఉన్నత వైద్య సేవలు పొందుతున్న ఆర్టీసీ బస్సు ప్రమాద ప్రయాణికులను మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు సోమవారం ఉదయం పరామర్శించారు. వారికి అందిస్తున్న వైద్య సేవలపై వైద్యులతో సమీక్షించారు. అదేవిధంగా పాడేరు జిల్లా ఆస్పత్రిలో ఆర్టీసీ బస్సు ప్రమాద బాధితులను వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పాడేరు ఎంపీపీ ఎస్.రత్నకుమారి, మాజీ ఎంపీపీలు ఎస్.వి.రమణమూర్తి, మత్స్యరాస వెంకటగంగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ

ఎంవీపీకాలనీ: పాడేరు ఘాట్‌రోడ్డులో గాయాలపాలై మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పలువురు రాజకీయ నాయకులు పరామర్శించారు. ఇక్కడ చికిత్స పొందుతున్న కిల్లో బోడిరాజు (39), బుట్ట చిన్నమ్ములు (48), బుట్ట దుర్గాభవానీ (14), బుట్ట రామన్న (14)తోపాటు సామర్ల బాబూరావు (50)లను సోమవారం మధ్యాహ్నం ఎమ్మెల్సీ కుంభ రవిబాబు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఆయన అనంతరం వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, విశాఖ తూర్పు నియోజకవర్గ నాయకుడు అక్కరమాని వెంకటరావు తదితరులు క్షతగాత్రులను పరామర్శించారు.



రోప్ సహాయంతో బస్సును వెలికి తీసేందుకు ప్రయత్నిస్తున్న కూలీలు

వెలికితీతకు వర్షంతో ఆటంకం

సాక్షి,పాడేరు: ఘాట్ లోయలోకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సును బయటకు తీసే పనులకు వర్షం ఆటంకంగా మారింది. విజయనగరం నుంచి రోప్‌లు, చోడవరం దరి గోవాడకు చెందిన పెద్ద సంఖ్యలో కూలీలను ఆర్టీసీ అధికారులు అందుబాటులో ఉంచారు. పాడేరుకు చెందిన రెండు ఎస్కాట్ యంత్రాలను తీసుకువచ్చారు. ఈ క్రమంలో సోమవారం కుండపోత వానతో లోయలోకి కూలీలు దిగడానికి వీలుకాలేదు. కొంతమంది ఆర్టీసీ సిబ్బంది లోయలోకి దిగి బస్సుకు రోప్ కట్టారు. ఇంతలో మరలా వర్షం కురవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరబాబుతోపాటు ఆర్టీసీ అధికారులు, పోలీసులు సంఘటన ప్రాంతంలోనే నిరీక్షించారు. చీకటి పడినా వర్షం తగ్గక పోవడంతో వారంతా పాడేరుకు తరలివచ్చారు. మంగళవారం ఉదయం నుంచి బస్సు వెలికితీత పనులు చేస్తామని చెబుతున్నారు. ఘాట్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి కారణమైన చెట్టు కొమ్మలను పూర్తిగా తొలగించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా వీటిని నరికివేశారు.



బాధితులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



పాడేరు జిల్లా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందివ్వాలని ఆదేశిస్తున్న జోనల్ చైర్‌పర్సన్ బంగారమ్మ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు

చోడవరం: నియోజకవర్గంలో విద్యుత్ లైన్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీ ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ మహేంద్రనాథ్, డీఈఈలతో కలిసి ధర్మశ్రీ సోమవారం సమీక్ష నిర్వహించారు. పలు ప్రదేశాల్లో కొత్తగా సబ్‌స్టేషన్ల ఏర్పాట్లపై చర్చించారు. చోడవరం మండలంలో ఉన్న దుడ్డుపాలెం, డి.బుచ్చెయ్యపేట గ్రామాలు కశింకోట ఆర్ఈసీఎస్ పరిధిలో ఇప్పటి వరకూ ఉండడం ఇటీవల ఆ సంస్థలను ఏపీడీసీఎల్‌లో విలీనం చేయడంతో ఆయా గ్రామాల విద్యుత్ సమస్యలను ఎస్ఈ మహేంద్రనాథ్‌కు వివరించారు. ఆయా గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్లు వేరే సబ్ స్టేషన్‌పై ఉండడం వల్ల తరుచూ విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వెంకన్నపాలెం లేక మామిడిపాలెం సబ్‌స్టేషన్లకు ఆ లైన్లను మార్చాలని ధర్మశ్రీ కోరారు. దీనిపై ఎస్ఈ సానుకూలంగా స్పందించారు. గోవాడ నుంచి భోగాపురం వెళుతున్న మెయిన్‌లైన్ కొండపై ఉండడం వల్ల తరుచూ విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఆ సమస్యను కూడా పరిష్కరించమని కోరారు. నర్సయ్యపేట వద్ద సబ్‌స్టేషన్ ఏర్పాటుపై ఇప్పటికే సీఎండీ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, దీనికి ఇప్పటికే 50 సెంట్లు స్థల సేకరణ కూడా చేశామని ధర్మశ్రీ చెప్పారు. నర్సయ్యపేటలో సబ్‌స్టేషన్ త్వరలో ఏర్పాటు చేసేందుకు అధికారులు సుముఖత వ్యక్తం చేశారు. రోలుగుంట మండలంలో కొంతలం, కేపీ అగ్రహారంలో సబ్‌స్టేషన్లు, బుచ్చెయ్యపేట మండలం కోమళ్లపూడి వద్ద ఎస్ఈజెడ్‌కు ప్రతిపాదన ఉండడంతో అక్కడ సమీపంలో 132 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. గర్నికం దగ్గర 6 నుంచి 10 ఎకరాల వరకూ భూ సేకరణ చేశామని, అక్కడ 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ధర్మశ్రీ చెప్పారు. సమావేశంలో డీఈఈ సురేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యారావు, దుడ్డుపాలెం సర్పంచ్ కూర్మదాసు మాలిబాబు,గౌరీపట్నం సర్పంచ్ చంద్రరావు పాల్గొన్నారు.



ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్‌తో సమీక్షిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు పునఃప్రారంభం

యజమానులను సన్మానించిన ఎమ్మెల్యే గణేష్



ప్రైవేట్ భవనాన్ని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నర్సీపట్నం: నర్సీపట్నం మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు పునఃప్రారంభమయ్యాయి. విస్తరణలో భాగంగా మొదటి విడతలో ప్రభుత్వ భవనాలను తొలగించారు. భవన యజమానులకు పెద్ద మొత్తంలో నష్టం జరగకూడదని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ వారి అభ్యర్థన మేరకు రోడ్డు విస్తరణ వంద అడుగుల నుండి 90 అడుగులకు కుదించారు. దీంతో వంద మందికి పైగా భవన యజమానులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఎమ్మెల్యేకు నిరభ్యంతర పత్రాలను అందజేశారు. మున్సిపల్ అధికారులు సోమవారం శ్రీకన్య జంక్షన్‌లోని ప్రైవేట్ భవనాల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా భవన యజమానులకు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలియజేసి, వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్ తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను, కౌన్సిలర్లు మాకిరెడ్డి బుల్లిదొర, సిరసపల్లి నాని, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీషా బేగం, పార్టీ సీనియర్ నాయకులు కర్రి రాంగోపాల్, కోఆప్షన్ సభ్యులు లగుడు స్వామి, గొలుగొండ వైస్ ఎంపీపీ జక్కునాయుడు పాల్గొన్నారు.



భవన యజమానిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

పంతాలకు పోతే నష్టపోతారు

ఇంటి స్థల వివాదంపై అన్నదమ్ములకు తహసీల్దార్ హితవు

నాతవరం: చిన్న విషయాలకు తగాదాలు పడి, కేసులు పెట్టుకోవడం వలన కుటుంబాల మధ్య కక్షలు పెరిగి అన్ని విధాలా నష్టపోతారని తహసీల్దార్ ఎస్ఎస్‌వీ శ్రీనివాస్‌నాయుడు హితవుపలికారు. మండలంలోని మర్రిపాలెం గ్రామం దళితవాడలో ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలంపై గత కొన్నేళ్లుగా అన్నదమ్ములు ఘర్షణ పడుతున్నారు. తరచూ ఇరువరూ స్పందనలో ఫిర్యాదులు చేస్తుండటంతో ఈ వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది. సమస్యపై దృష్టి సారించిన తహసీల్దార్ పోలీసు బందోబస్తుతో సోమవారం వివాదానికి కారణమైన స్థలానికి వెళ్లి, సర్వే చేశారు. గతంలో తండ్రి పేరున కాలనీలో 5 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. తండ్రి మరణానంతరం ముగ్గురు కుమారులు ఆ స్థలం పంపకం విషయంలో తగాదాలు పడుతున్నారు. సమస్య తీవ్రమయ్యే ప్రమాదం ఉండటంతో తహసీల్దార్ చొరవ తీసుకున్నారు. అన్నదమ్ముల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించారు. వారి సమక్షంలోనే సర్వేయర్ బాలిరెడ్డిచే కొలతలు తీయించి, హద్దులు నిర్ణయించారు. ఇక మీదట తగాదాలకు స్వస్తిపలికాలని అన్నదమ్ములు ముగ్గురికి సూచించారు. మొదట అగ్రహించిన అన్నదమ్ములు, తహసీల్దార్ చెప్పిన మాటలకు అంగీకరించారు. దీంతో వివాదం సద్దుమణిగినట్టయింది.



వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు



హరికుమార్

కె.కోటపాడు: వారాడకు చెందిన ఈమంది హరికుమార్(25) ఈ నెల 18తేదీ నుంచి కనిపించడం లేదని తల్లి అన్నపూర్ణ ఎ.కోడూరు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. దేవరాపల్లిలో సెల్‌పాయింట్ నిర్వహిస్తున్న హరికుమార్ ఇంటికి చేరలేదని, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ తెలియలేదని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. హరికుమార్‌కు ఈ నెల 30న వివాహం జరిపించుటకు నిశ్చయించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపారు.

కార్మికుడి ఆత్మహత్య



మృతుడు చంద్రశేఖర్

నక్కపల్లి: రాజయ్యపేట సమీపంలో గల హెటిరో కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడు సోమవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలివి. నర్సీపట్నం సమీపంలో శివపురం ప్రాంతానికి చెందిన బట్టా రామగోవింద సత్య చంద్రశేఖర్(42) హెటిరోలో ఎస్ఆర్ బ్లాక్‌లో షిఫ్ట్ ఇన్‌చార్జ్‌గా గత 14 ఏళ్ల నుంచి పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి వచ్చి సహచరుడితో పాటు విధులకు హాజరయ్యాడు. సోమవారం తెల్లవారు జాము నుంచి అతను కనిపించలేదు. మిగిలిన ఉద్యోగులు వెతకగా సమీపంలో ఉన్న షెడ్లో ఉరేసుకుని కనిపించాడు. కొన ఊపిరితో ఉన్న అతన్ని వెంటనే అంబులెన్స్‌లో నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్టు ధ్రువీకరించారు. దీనిపై కుటుంబ సభ్యులకు కంపెనీ సమాచారం ఇవ్వడంతో వారు ఆస్పత్రికి చేరుకున్నారు. చంద్రశేఖర్ ఆత్మహత్యకు కారణాలు తెలియవని, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ అప్పన్న తెలిపారు.

21 కేజీల గంజాయితో ముగ్గురి అరెస్టు

చోడవరం రూరల్: ముందస్తు సమాచారం మేరకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తమ సిబ్బందితో జరిపిన తనిఖీలో లగేజీ బ్యాగుల్లో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు అంతర జిల్లాల గంజాయి అక్రమ రవాణాదారులు పట్టుబడ్డారు. సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో తమకు అందిన సమాచారం మేరకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద తనిఖీ చేస్తుండగా అవుట్ గేట్ వద్ద లగేజి బ్యాగులతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న కడప జిల్లా చక్రాయపేట మండలం బొజ్జవాండ్లపల్లికి చెందిన కానాల గంగిరెడ్డి(45), వేల్పుచర్ల శ్రీనివాసులురెడ్డి(38), అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం వనబంగి గ్రామానికి చెందిన జాగారపు కామేశ్వరరావు(63)లను ప్రశ్నించి, వారి లగేజీలను పరిశీలించగా వారి వద్ద సుమారు 21 కేజీల గంజాయి బయటపడిందన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేసి, చోడవరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా వీరికి రిమాండ్ విధించారని అన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే తమకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా సీఐ కోరారు.

స్పందన అర్జీలకు సకాలంలో పరిష్కారం

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం

తుమ్మపాల: స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలకు వెంటనే సమాధానాలు ఇవ్వాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయనతో పాటు జేసీ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఆర్‌డీఏ పీడీ బి.లక్ష్మిపతి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులకు స్పష్టమైన సమాధానాలు సకాలంలో ఇవ్వాలన్నారు. సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు చేపట్టాలన్నారు. మొత్తం 266 అర్జీలు నమోదు కాగా అధికంగా రెవెన్యూ సంబంధిత భూమి సమస్యలు ఉన్నాయి.

రెగ్యులర్ ఉపాధ్యాయుల్ని బదిలీ చేయవద్దు

పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన ఉపాధ్యాయుడిని వర్కు అడ్జస్టమెంట్ పేరుతో మరో పాఠశాలకు చేస్తున్న బదిలీ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని మునగపాక మండలం టి.సిరసపల్లి గ్రామస్తులు కలెక్టరేట్ గేటు వద్ద నిరసన తెలిపారు. రెగ్యూలర్ ఉపాధ్యాయుల కృషి కారణంగానే 20 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఇప్పుడు 68 మందికి పెరిగిందని, ఎంటీఎస్ ఉపాధ్యాయులకు పాఠశాలను అప్పగించి రెగ్యులర్ ఉపాధ్యాయుల్ని బదిలీ చేస్తే తమ పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. ఈ మేరకు వినతి అందజేశారు.

శ్మశానవాటిక ఆక్రమణపై ఫిర్యాదు

పూర్వకాలంగా శ్మశానవాటికగా ఉన్న భూమిని రీసర్వేలో వీఆర్వో శేఖర్, సర్వేయర్ శ్యామ్‌లు ఇతరుల పేరున మార్చేశారని, వారు ఇప్పుడు శ్మశానవాటికను ఆక్రమించేస్తున్నారని, తక్షణమే అడ్డుకోవాలని చీడికాడ మండలం సిరిజాము గ్రామ శివారు గదబూరు గిరిజనులు కలెక్టరేట్ వద్ద నిరసన చేశారు. పూర్వీకులు ఇచ్చిన స్థలంలో శ్మశాన వాటిక కొనసాగుతుందని ఇప్పుడు కొందరు ప్రైవేటు వ్యక్తులు వచ్చి ఆక్రమిస్తున్నారని, ఇటీవల మరణించిన గిరిజనుడి దహనసంస్కరణలను వారు అడ్డుకున్నారని, పోలీసుల రక్షణతో చివరకు పూర్తి చేశామని తెలిపారు. అధికారులు స్పందించి శ్మశానవాటిక ఆక్రమణను అడ్డుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

ఫిర్యాదు చేస్తే ఇంటి బిల్లు నిలిపేస్తారట..

జగనన్న కాలనీలో మంజూరైన ఇంటి నిర్మాణం పూర్తి చేసినా బిల్లు మాత్రం చెల్లించడం లేదని స్పందనలో ఫిర్యాదు చేసినందుకు తమకు బిల్లు ఇచ్చేది లేదని సచివాలయ అధికారులు హెచ్చరిస్తున్నారని మాకవరపాలెం మండలం రాచపల్లి గ్రామానికి చెందిన రుత్తల లక్ష్మి ఫిర్యాదు చేశారు. ఇల్లు లేని పేదరికంలో ఉన్న మాకు జగనన్న ఇల్లు ఇస్తే అప్పులు చేసి స్లాబ్ వరకు పూర్తి చేశానని, కానీ పునాదికి మాత్రమే 10 టన్నుల ఇసుక ఇచ్చి, మిగిలిన బిల్లు ఇవ్వకుండా అధికారులు కాలం గడిపేస్తున్నారని తెలిపింది. బిల్లు కోసం గతంలో ఫిర్యాదు చేసినందుకు ఇక బిల్లు ఇచ్చేది లేదని బెదిరిస్తున్నారని ఆమె కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేసింది.

వృద్ధురాలిపై దాడి చేసిన మనమళ్లు

తన కుమారులకు పంచిపెట్టగా జీవనం కోసం ఉంచుకున్న భూమిని తమకు ఇవ్వలేదంటూ వృద్ధురాలని కూడా చూడకుండా మనమళ్లు తనపై దాడి చేశారని అనకాపల్లి మండలం పూడేరు గ్రామానికి చెంది బొబ్బిలి అప్పలనర్స స్పందనలో ఫిర్యాదు చేసింది. గ్రామంలో ఉన్న వ్యవసాయ భూమిని నలుగురు కొడుకులకు సమానంగా పంచగా, మిగిలి ఉన్న 11 సెంట్ల భూమిని తన పేరున ఉంచుకుని తన అనారోగ్య సమస్యలు, కష్టసుఖాలను చూస్తున్న మరో మనుమడు గణేష్‌కు ఇవ్వడంపై మిగిలిన మనమళ్లు దాడి చేశారని తెలిపింది. భూమిలోకి రాకుండా అడ్డుకుంటున్నారని కత్తులు, కర్రలతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారి నుంచి మాకు రక్షణ కల్పించాలని కోరింది.



శ్మశాన వాటికను ఆక్రమణ నుంచి రక్షించాలంటూ నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఎస్పీ కార్యాలయానికి 36 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో స్పందనకు సోమవారం 36 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాలు మేరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. స్పందనలో వచ్చే అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలపై అర్జీలు ఎక్కువగా వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలోమ జిల్లా క్రైమ్ ఎస్పీ పి.సత్యనారాయణరావు, డీపీటీసీ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కౌలు రైతుకు.. కష్టం లేకుండా

- జోరుగా కౌలు కార్డుల పంపిణీ
- ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణ సదుపాయం
- సాధారణ రైతులతో సమానంగా ప్రభుత్వ పథకాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న కౌలు రైతులు

కౌలు రైతుకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. వారి కష్టాన్ని గుర్తించిన జగనన్న సర్కారు సీసీఆర్‌సీ (క్రాప్ కల్టివేటర్ రైట్/పంట సాగు హక్కు పత్రం) కార్డులు మంజూరు చేసి అండగా నిలుస్తోంది. సీసీఆర్ కార్డుతో సాధారణ రైతులకు వర్తించే ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కౌలురైతుకూ వర్తిస్తాయి. ఒక్కో కౌలురైతుకు రైతు భరోసా పథకం కింద ఏడాదికి రూ.13,500 పెట్టుబడి సాయంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

అనకాపల్లి రూరల్ : ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున అర్హులైన కౌలు రైతులందరికీ సీసీఆర్ కార్డులు మంజూరు చేయడానికి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రక్రియను వేగవంతం చేసింది. ఇప్పటికే అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 5 మండలాల్లో 911 మంది కౌలురైతులకు ఈ కార్డులను అందజేశారు. గత ఏడాది 623 మందికి కౌలు కార్డులు మంజూరు చేయగా ఈ సారి పెద్ద మొత్తంలో 2,112 మందికి కౌలు కార్డులు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

సీఎం నిర్ణయంతో మారిన కౌలు రైతు దశ

కౌలు రైతులను ఆదుకునేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. భూయజమానులకు వారి భూమిపై ఉన్న హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా 1956 రక్షిత కౌలుదారీ చట్టాన్ని రద్దు చేసి 2019లో కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. భూ యజమానుల హక్కుల రక్షణతో పాటు భూమిని సాగు చేసే కౌలు రైతులకు పంట రుణం పొందడానికి వీలుగా సాగుదారు కార్డులు మంజూరు చేసేలా కొత్త చట్టం తీసుకురావడంతో సాగుదారులకు ఇది వరంగా మారింది. ప్రస్తుతం సాగు హక్కు పత్రాలు పొందిన కౌలురైతులు వ్యవసాయశాఖ ద్వారా వచ్చే సకల రాయితీలు నేరుగా పొందుతున్నారు. ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణం పొందే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

సాగు కార్డు పొందడం ఇలా..

సాగుదారు కార్డు భూ యజమానికి, సాగు చేస్తున్న రైతుకు మధ్య ఒప్పందాన్ని సూచిస్తోంది. కార్డుపైన భూ యజమాని (లేదా వారి ప్రతినిధి), సాగుదారు, గ్రామ పరిపాలనాధికారి (వీఆర్వో/ఆథరైజ్డ్ ఆఫీసర్) సంతకాలు ఉండాలి. ప్రత్యేకంగా భూ యజమాని మరే ఇతర పత్రం రాసివ్వవలసిన అవసరం లేదు. పంట సాగుదారు కార్డు కాల పరిమితి 11 నెలలు మాత్రమే. ఆ తర్వాత సాగుదారు మళ్లీ కొత్త కార్డు పొందాల్సి ఉంటుంది. సాగుదారు కార్డు పొందిన రైతుకు ఆ భూమిపై ఎటువంటి హక్కులు ఉండవు. కేవలం పంట రుణాలు, పంట బీమా, సబ్సిడీ వంటి ప్రభుత్వ మద్దతు పొందడానికి మత్రమే ఈ కార్డు అవకాశం కల్పిస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే అంటే మే నెల నుంచి కార్డులు జారీ చేస్తున్నారు. ఇప్పటికే 911 మందికి కార్డులు జారీ చేశారు. జూలై ప్రారంభం నుంచి జరిగిన జగనన్న సురక్ష శిబిరాల ద్వారా చాలా మంది కౌలు రైతులకు సాగుదారు కార్డులు మంజూరు చేశారు.





తుమ్మపాలలో కౌలు రైతుకు సీసీఆర్ కార్డు అందజేస్తున్న అధికారులు (ఇన్‌సెట్) పంటల సాగు హక్కు పత్రం

అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్‌లో సాగు కార్డుల వివరాలు ఇలా..

మండలం	గ్రామాలు	గత ఏడాది	ప్రస్తుత ఏడాది
అనకాపల్లి	36	98	168
కశింకోట	28	176	274
మునగపాక	28	177	190
సబ్బవరం	33	119	198
పరవాడ	25	53	81
మొత్తం	150	623	911

అర్హులందరికీ కౌలు కార్డులు..



అర్హత కలిగిన కౌలు రైతులందరికీ కౌలు కార్డులు అందజేస్తున్నాం. ఈ కార్డుల జారీ వలన భూయజమానికి ఏ విధమైన ఇబ్బంది ఉండదు. కేవలం 11 నెలల కాల పరిమితితో కార్డు పని చేస్తుంది. సాగు హక్కు తప్ప భూమిపై వారికి హక్కు ఉండదు. ఇంకా ఎవరైనా అర్హులుండి, దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా కౌలుదారు కార్డులిస్తాం.

– ఎం. రామారావు, ఏడీ, అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్

దరఖాస్తు చేసుకుంటే కార్డు మంజూరవుతుంది



పంట సాగు హక్కు పత్రంతో ఎన్నో ప్రయోజనాలు కలిగాయి. అవసరమైనపుడు పంట రుణం బ్యాంకు నుంచి పొందడానికి ఈ కార్డు ఉపయోగపడుతోంది. అలాగే రైతు భరోసా క్రమం తప్పకుండా అందుతోంది. పంట నష్టం జరిగినపుడు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని అధికారులు చెప్పారు. గతంలో ఈ కార్డు పొందాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చేది.ఈ ప్రభుత్వం వచ్చాక దరఖాస్తు చేసుకుంటే కార్డు మంజూరు చేస్తున్నారు.

– తాసుబిల్లి మోదునాయుడు, కౌలు రైతు, తుమ్మపాల

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

అనకాపల్లిటౌన్: స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయాల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని పైన పేర్కొన్న వ్యక్తులు తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా కోరారు.

తగ్గిన టమాటా ధర



తాళ్లపాలెం వారపు సంతలో కూరగాయల విక్రయాలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో టమాటా ధర క్రమేపీ సాధారణ స్థాయికి చేరుకుంటోంది. నెల రోజుల క్రితం కిలో రూ.200 ఉన్న ధర ప్రతి వారం తగ్గుతూ ప్రస్తుతం రూ.50కి చేరుకుంది. గత వారం రూ.70కి విక్రయించగా, ఈ వారం రూ.20 తగ్గింది. రానున్న రోజుల్లో ఇంకా తగ్గిపోనుందని, ఉత్పత్తి పెరుగుతుండటమే ఇందుకు కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇక ఉల్లిపాయ రూ.25 నుంచి రూ.30కి పెరిగింది. బంగాళాదుంప రూ.30, దొండకాయ రూ.40, బెండకాయ, వంకాయ, బీట్రూట్, క్యారెట్, బీరకాయ, గోరు చిక్కుడు, చేమదుంప రూ.60, పచ్చిమిర్చి, క్యాప్సికం రూ. వంద, పాదు చిక్కుడు రూ. 120, అల్లం రూ.150కి విక్రయిస్తున్నారు.

మరిడిమాంబ ఆలయ చైర్మన్‌గా కోట్ని

అనకాపల్లిటౌన్: స్థానిక కోట్నివీధి శ్రీ మరిడిమాంబ అమ్మవారి ఆలయ చైర్మన్‌గా కోట్ని శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఆలయ ఆవరణలో సోమవారం జరిగిన ఎన్నికల్లో ధర్మకర్తలుగా అల్లం ప్రసాద్, కోరుకొండ వాసు, సీతా సూకరాజు, కె.నాగరాజు, స్వప్నలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన కమిటీ రెండేళ్లపాటు మనుగడలో ఉంటుందన్నారు. అమ్మవారి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేయనున్నట్లు పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 153 బెల్లం దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,110	4,500
రెండో రకం	4,050	4,090
మూడోరకం	3,930	3,965

అనకాపల్లి సినిమాలు

బేబి : రాజా
పిజ్జా : సత్యనారాయణ స్క్రీన్-1
డీడీ రిటర్న్స్ భూతాల బంగ్లా : సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్ : షిర్డిసాయి
భోళాశంకర్ : పర్తిసాయి
భోళాశంకర్ : వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్ : శ్రీసత్య
బ్రో : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-14 యూనిట్లు, ఓ పాజిటివ్-19 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 393 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

మరిడిమాంబ ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ



మరిడిమాంబ అమ్మవారి ఉత్సవ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: గ్రామ దేవతల ఉత్సవాలను ప్రజలంతా కలిసి ఆనందంగా నిర్వహించుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి కార్యాలయంలో సోమవారం కోట్నివీధి శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవ గోడ పత్రికను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ నెల 31న అమ్మవారి ఉత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ 27న ఆదివారం ఆలయం నుంచి 108 గరగలతో అమ్మవారి రథయాత్ర నిర్వహిస్తామన్నారు. 29న పట్టణంలో పురవీధుల మీదుగా అమ్మవారి సారె ఊరేగింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ జి.రామ్మూర్తి, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏవీ రత్నకుమారి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణఅప్పారావు, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు దివ్యాంగుల ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నాలో పాల్గొన్న దివ్యాంగులు

అనకాపల్లిటౌన్: దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు పింఛన్, ప్రభుత్వశాఖల్లో ఉద్యోగ అవకాశాలు, సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయవేదిక రాష్ట్ర కార్యదర్శి కోడూరు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూకఅప్పారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షలకుపైగా దివ్యాంగులు ఉన్నారని, వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాలో దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయం తక్షణమే ఏర్పాటు చేయాలని, ప్రభుత్వశాఖ ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషన్లు, 2016 దివ్యాంగుల చట్టం అమలు, నిరుపేద, అవివాహ దివ్యాంగులకు ప్రత్యేక రేషన్‌కార్డు జారీ తదితర డిమాండ్లపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాపేటి భాస్కరరావు, కాండ్రేగుల అప్పారావు, పెట్ల సన్యాసిరావు, నారముని ఫణీంద్ర కుమార్, బుద్ధ ధనలక్ష్మి, ఆడారి అన్నపూర్ణ, బొండా లక్ష్మి, కె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

కె.కోటపాడు : వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది చెప్పే ఆరోగ్య జాగ్రత్తలను ప్రజలు తప్పక పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి నిర్మల సూచించారు. గొండుపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. 122 మందికి ఔట్ పేషెంట్లకు వైద్య సేవలు అందించారు. వైద్యం పొందేందుకు ఆస్పత్రికి రాలేని స్థితిలో ఉన్న ఆరుగురు రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి, వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన మందులను అందించారు. హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, రమణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్‌పై క్రషర్ బుగ్గితో వాకర్ల ఇబ్బందులు



క్రషర్ బుగ్గిపైనే నడుస్తున్న వాకర్లు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నిత్యం వాకర్లు నడిచే ట్రాక్‌పై క్రషర్ బుగ్గి వేయడంతో ఇబ్బంది పడుతున్నట్లు క్రీడా మైదానం వాకర్స్ అండ్ వాకర్స్ గౌరవాధ్యక్షుడు వై.త్రినాథ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల వర్షాలు పడడంతో వాకింగ్ ట్రాక్‌పై జీవీఎంసీ అధికారులు క్రషర్ బుగ్గి వేశారని, దీంతో పిల్లలు, వృద్ధులు వాకింగ్ సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే దాన్ని తొలగించాలని ఆయన కోరారు.

గృహ సారథులకు సముచిత స్థానం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: పార్టీని మరింతగా బలోపేతం చేయడంలో గృహసారథులు పూర్తిస్థాయిలో పని చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. నియోజకవర్గ స్థాయి సచివాలయ గృహసారథుల సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ గృహసారథులు కృషిచేయాలన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి సమీక్షలో గృహసారథులందరికీ పార్టీ తరఫున బీమా సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పడంతో ఆ దిశగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గృహ సారథుల వివరాలు సేకరించి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపనున్నట్లు పేర్కొన్నారు. అంకిత భావంతో పనిచేసే ప్రతీ కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం దక్కుతుందని భరోసానిచ్చారు. 2024 ఎన్నికల్లో పార్టీ విజయానికి గృహ సారథులే కీలకమన్నారు. సమావేశానికి చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాలకు చెందిన 300 మందికి పైగా గృహసారథులు హాజరయ్యారు. నాలుగు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపాలెం సంతకు తగ్గిన గొర్రెల తరలింపు



తాళ్లపాలెం సంతలో విక్రయిస్తున్న గొర్రెలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతకు గొర్రెలు అమ్మకానికి రావడం సోమవారం గణనీయంగా తగ్గింది. ఇక్కడికి రావలసిన గొర్రెలు తూర్పు గోదావరి జిల్లా తుని, ఇతర సంతలకు తరలి పోతుండటం ఇందుకు కారణంగా సమాచారం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల మందల కొనుగోలుకు పెంపకందారులకు రుణాలు ఇస్తోందని సమాచారం. వీటి కొనుగోలుకు ఇక్కడి గొర్రెల పట్ల లబ్ధిదారులు మొగ్గు చూపుతున్నారు. ఆంధ్ర రాష్ట్రంలో గొర్రెలు పెంపకందారులు, రైతులు, చిరు వ్యాపారులు పెంచినవి కావడం, మాంసం నాణ్యమైనది కావడం ఇందుకు కారణంగా తెలిసింది. లబ్ధిదారుల ఆసక్తికి అనుగుణంగా తెలంగాణ అధికారులు తూర్పు గోదావరి జిల్లాలోని తుని, ఇతర సంతల్లో ఈసారి కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. గతంలో కూడా రుణాలు ఇచ్చినప్పుడు 2018లో తాళ్లపాలెం సంతలో తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే రుణాలతో గొర్రెల మందలను పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. పొట్టేళ్లతో పాటు ఆడ గొర్రెలతో కూడిన సుమారు 20 వరకు ఉన్న మందను పెంచుకుని జీవనోపాధి మెరుగుపరచుకోవడానికి ఒక్కొక్క లబ్ధిదారునికి అందజేశారు. వాటి ఆరోగ్య పరిస్థితి ధ్రువీకరించడం, బీమా సదుపాయం కల్పించడం పశు వైద్యాధికారి పర్యవేక్షణలో జరిగేది. సంతలో తెలంగాణ జిల్లాల నుంచి లబ్ధిదారులు, అధికారులు వచ్చి కొనుగోలు చేయడంతో గొర్రెలకు డిమాండ్ ఏర్పడి పెంపకందారులు, వ్యాపారులకు ఎక్కువ ధర లభించేది. సంతకు ఆశీళ్ల రూపంలో కూడా అదనపు ఆదాయం సమకూరేది. అయితే వీటి కొనుగోలులో అప్పట్లో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో తాళ్లపాలెం సంతకు బదులు తుని, ఇతర సంతల్లో గొర్రెల మందలు కొనుగోలు చేయాలని నిర్ణయించారని సమాచారం. దీంతో వాటికి డిమాండ్ ఏర్పడి ఎక్కువ ధర లభించే అవకాశం ఉన్న దృష్ట్యా గొర్రెల వ్యాపారులు, పెంపకందారులు తుని, ఇతర సంతలకు గొర్రెలు తరలించి విక్రయానికి మొగ్గు చూపుతున్నారు. దీని వల్ల తాళ్లపాలెం సంతకు తాజాగా గొర్రెలు అమ్మకానికి రావడం గణనీయంగా తగ్గిందని వ్యాపారులు, పెంపకందారులు అంటున్నారు. అలాగే ప్రస్తుతం శ్రావణమాసం కావడం, చుట్టు పక్కల ప్రాంతాల్లో గొర్రెలు వినియోగించి నిర్వహించే పండగలు లేకపోవడం కూడా ఇవి తక్కువగా రావడానికి కారణం అంటున్నారు. అయితే సంతకు మేకలు మాత్రం యథావిధిగా అమ్మకానికి వచ్చాయి. సుమారు 600 వరకు మేకలతో పాటు గొర్రెల అమ్మకాలు సాగాయని సమాచారం.

జోరుగా హద్దు రాళ్ల ఏర్పాటు



రోలుగుంట రైతుల భూ సరిహద్దులో సర్వే రాళ్లు పాతిస్తున్న వీఆర్వో సాహెబ్

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం ద్వారా సర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లోని రైతుల భూముల సరిహద్దులో రాళ్లు పాతించే పనులు తహసీల్దార్ కె.వరహాలు ఆధ్వర్యంలో జోరుగా సాగుతున్నాయి. రోలుగుంట రెవెన్యూ సర్వే నెం.259 పరిధిలో 640 మంది రైతులకు చెందిన 1,041 ఎకరాల పంట భూములున్నాయి. వీటి సర్వే ఇప్పటికే పూర్తయింది. దీంతో నాలుగు రోజులుగా సరిహద్దుల్లో సర్వే రాళ్ల పాతిస్తున్నారు. వీఆర్వో ఎస్‌కే సన్యాసి సాహెబ్, సర్వేయర్ లక్ష్మణ్‌తో కలిసి 250 మంది రైతులకు చెందిన భూముల్లో సరిహద్దు రాళ్లు పాతారు. ఈ సందర్భంగా వీఆర్వో మాట్లాడుతూ తహసీల్దార్ ఆదేశాల మేరకు, స్థానిక రైతుల సహకారంతో వివాదాలకు తావులేకుండా సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలోనే రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఆవులను తరలిస్తున్న వ్యాన్ అడ్డగింత



జాతీయ రహదారిపై నిలిపివేసిన ఆవుల వ్యాన్

అనకాపల్లిటౌన్ : విజయనగరం నుంచి అనకాపల్లి స్థానిక జాతీయ రహదారి మీదుగా తుని వైపు తరలిపోతున్న ఆవుల వ్యాన్‌ను రాష్ట్ర యాదవ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కోడిబోయిన బాబ్జీ యాదవ్ సోమవారం నిలిపివేశారు. వ్యాన్‌లో 13 ఆవులు, మూడు దూడలు ఉన్నట్లు సమాచారం. వ్యాన్‌ను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామని ఆయన తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

కశింకోట : అక్రమ మద్యం విక్రయాలపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. అందులో భాగంగా మండలంలోని పేరంటాలపాలెంలోని కిరాణా దుకాణంపై ఆకస్మిక దాడి చేశారు. ఇక్కడ అక్రమంగా విక్రయిస్తున్న ఏడు బ్రాందీ సీసాలను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు.

సాగునీటి కోసం స్పందనలో రైతుల వినతి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏవో సూర్యనారాయణ

నర్సీపట్నం: ఖరీఫ్ వరి నాట్లు వేసుకునేలా సాగునీరు అందించాలని కోరుతూ తాండవ, రావణాపల్లి జలాశయాల రైతులు ఆర్డీవో కార్యాలయ ఏవో సూర్యనారాయణకు వినతిపత్రం అందించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 39 ఫిర్యాదులు వచ్చాయి. ఆర్డీవో ఇతర అధికారిక కార్యక్రమాల్లో బిజీగా ఉండటంతో కార్యాలయ ఏవో వినతులు స్వీకరించారు. తాండవ జలాశయానికి చెందిన 10, 11 మేజర్ కాలువలకు నీరు అందక నాట్లు వేసేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయకట్టు రైతులు పేర్కొన్నారు. ఎండిపోతున్న ఆకు మడులను ట్యాంకర్ల నీటి ద్వారా కాపాడుకుంటున్నామని, కాలువలపై జలాశయం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సాగునీరు అందటం లేదని వాపోయారు. ఆయకట్టుకు నీటిని అందించి ఆదుకోవాలని రైతులు విన్నవించారు. ఆర్డీవో జయరాం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి, పరిష్కరిస్తానని బాధితులకు ఏవో హామీ ఇచ్చారు. స్పందనలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వర్షం.. రైతుల్లో హర్షం



చోడవరంలో కురుస్తున్న వర్షం

చోడవరం/మాడుగుల/గొలుగొండ : వరుణుడు కరుణించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. వరినాట్లు వేసే సమయంలో గత కొద్ది రోజులుగా వర్షాలు మొహం చాటేశాయి. దీంతో నీరులేక మెట్ట ప్రాంతాల్లో వరి నాట్లు నిలిచిపోయాయి. ఎప్పుడు వర్షం కురుస్తుందా? అని ఆశగా ఎదురు చూస్తున్న మెట్ట ప్రాంత రైతులకు సోమవారం సాయంత్రం కుండపోతగా కురిసిన వర్షం ఊరటనిచ్చింది.

- చోడవరం పరిసరాల్లో సుమారు 25 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. దాదాపు గంటపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురడంతో రోడ్లపై వర్షపునీరు పొంగి ప్రవహించింది. పొలాల్లో నీరు చేరింది. దీంతో దమ్ములు పట్టి వరినాట్లు వేసేందుకు సిద్ధంగా ఉంచిన పొలాలన్నీ వర్షపు నీరుతో నాట్లకు అనుకూలంగా మారాయి. రైతులు వరినాట్లకు సన్నద్ధమవుతున్నారు.
- మాడుగుల మండలంలో 20 రోజుల తర్వాత సోమవారం భారీ వర్షం కురిసింది. గత నెల్లో ముందుగానే తొలకరి జల్లులు కురవడంతో వరినాట్లు ప్రారంభించారు. ముందుగా వేసిన వరినాట్లు వర్షాలు ముఖం చాటేయడంతో ఎండిపోతాయేమోనన్న రైతుల ఆందోళనకు తాజా వర్షం ఉపశమనం కలిగించింది. మెట్ట భూముల్లో వరి చేలు తెప్పరిల్లుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- గొలుగొండ మండలంలో సాయంత్రం గంట పాటు వర్షం దంచికొట్టింది. మండలంలోని చిన్నయ్యపాలెం, జోగుంపేట, గొలుగొండ, కొత్తమల్లంపేట, కొత్తపాలెం, దారపాలెం ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం రైతుల్ని ఆనందంలో ముంచెత్తింది. భారీ వర్షం కురవడంతో నాట్లు వేసిన రైతులకు ఊరట దక్కగా, నాట్లు వేయని రైతుల నారుమడులకు ప్రాణం పోసింది. మూడు వారాలుగా ఈ ప్రాంతంలో వర్షాల్లేక ఇబ్బంది పడుతున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి



స్పందనలో తహసీల్దార్ శ్రీనివాస్ నాయుడుకు ఫిర్యాదు చేస్తున్న గిరిజనులు

నాతవరం: కలెక్టర్ తాజాగా పర్యటించిన గిరిజన గ్రామాల్లో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ ఎస్ఎస్‌వీ శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సరుగుడు, సుందరకోట, ఎ.శరభవరం, పీకే గూడెం, ములగపూడి, మర్రిపాలెం, వెన్నలపాలెం, డి.యర్రవరం గ్రామాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ రెండు పర్యాయాలు గిరిజన ప్రాంతాల్లో పర్యటించారని, ఆయన దృష్టికి తీసుకెళ్లిన సమస్యల్ని యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామన్నారు. అధికంగా పోడు వ్యవసాయం చేసుకునే భూములకు పట్టాలు, హక్కు పత్రాల కోసం రైతులు నివేదించినట్లు తెలిపారు. సుందరకోట పంచాయతీలో రెవెన్యూ సమస్యలపై సర్పంచ్ కొండపల్లి చినతల్లి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.రాజు గిరిజన పెద్దలతో కలిసి స్పందనలో ఫిర్యాదు చేశారు.